క్లుప్తంగా

తోకలపల్లిలో ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు



తోకలపల్లి చర్చిలో ఐక్య క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: తోకలపల్లి చర్చిలో నిడమర్రు మండల యూపీఎఫ్ సేవకులు సోమవారం ఏర్పాటు చేసిన ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే, ఉంగుటూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పుప్పాల వాసుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫాదర్ ఐ జ్యోతిబాబు క్రిస్మస్ సందేశాన్ని అందించి అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాసుబాబు మాట్లాడుతూ క్రిస్మస్‌ను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. అనంతరం సంఘ పెద్దలతో కలిసి ఆయన కేక్ కట్ చేసారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, యూపీఎఫ్ గైరవ అధ్యక్షుడు రెవ, జల్లూరి మహిమారావు తదితరులున్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు



పిప్పర పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి ప్రియాంక

గణపవరం: గర్భిణులు ప్రతి వారం తప్పనిసరిగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య పరీక్షలకు హాజరు కావాలని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ప్రియాంక అన్నారు. సోమవారం పీహెచ్‌సీలో 7, 8, 9 నెలల గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు, బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, స్కానింగ్ పరీక్షలను నిర్వహించి పలు ఆరోగ్య సూచనలందించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పైప్‌లైన్ విస్తరణ పనులు



పైప్‌లైన్ పనులు చేస్తున్న దృశ్యం

దెందులూరు: పోతునూరు గ్రామం కొత్తూరు ప్రాంతంలో రూ. 50 లక్షల అంచనా వ్యయంతో ఐదున్నర కిలోమీటర్ల పొడవున పైప్ లైన్ నిర్మాణం చురుగ్గా కొనసాగుతోంది. దాదాపు 30 ఏళ్ల క్రితం వేసిన పైప్‌లైన్లు లోతైన ప్రాంతంలో ఉండడంతో కొత్తగా పైప్‌లైన్లు నిర్మాణం చేపట్టారు. ప్రధాన పైపులైన్ విస్తీర్ణంతో అంతర్గత రహదారులు వెంబడి 4 అంగుళాలు విస్తీర్ణంతో హెచ్‌డీ పైపులు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణ పనులను మండల పంచాయతీలు విస్తరణ అధికారి పోతునూరు గ్రామ కార్యదర్శి షరీఫ్ పరిశీలించారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

నిడమర్రు: రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు మంగళవారం నుంచి వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకూ రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు నాగరాజు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ రెవెన్యూ సభలు నిర్వహిస్తామన్నారు. 10న గుణపర్రు 11న విప్పర్తికండ్రిక, 12న అడవికొలను, 13న తోకలపల్లి, 16న పెదనింద్రకొలను, 17న పత్తేపురం, 18న నాగనమిల్లి, 19న క్రొవ్విడి, 20న బావాయిపాలెం, 21న దేవరగోపవరం, 23న ఆముదాలపల్లి, 24న ఎనికేపల్లి, 26న నిడమర్రు, 27న క్రిష్ణాపురం, 28న సిద్దాపురం, 30న చానమిల్లి, 31న పెదరామచంద్రపురం, 2025 జనవరి 2న తిమ్మారావుగుడెం, 3న కాకరమిల్లి, 4న వెంకటాపురం, 6న బువ్వనపల్లి, 7న నరసింహపురం, 8న మందలపర్రు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. రైతులు ఈ సదస్సులు వినియోగించుకోవాలని తహసీల్దారు కోరారు.

15న జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

ఏలూరు (టూటౌన్): ఈనెల 14, 15 తేదీల్లో విజయవాడలో ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగరాజు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తొలిరోజు విజయవాడలోని సిద్ధార్థ అకాడమి, రెండో రోజు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించే సమావేశాల్లో వేదిక హక్కులు, ఆశయాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, అతిథులుగా సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యామ్ ప్రసాద్, సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షులు తాళ్లూరి విష్ణువు, ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పరశురాం హాజరవుతారని పేర్కొన్నారు.

బతుకు పోరాటం

- వందల కిలోమీటర్ల దూరం నుంచి వలస
- కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్న మధ్యప్రదేశ్ యువకులు
- శీతాకాలపు దుస్తుల వ్యాపారమే వారి జీవనోపాధి

భీమడోలు: పొట్ట చేత పట్టుకుని జీవనోపాధి కోసం వేల కిలోమీటర్ల దాటి, ఉన్న వారిని వదిలి జీవన పోరాటం చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. భాష రాని చోట ఇక్కడి వారితో మమేకమై కష్ట నష్టాలను ఓర్చి చిరు వ్యాపారాలు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఏటా చలి కాలంలో మూడు, నాలుగు నెలల పాటు ఉన్ని దుస్తులు విక్రయించేందుకు భీమడోలు ప్రాంతానికి మధ్యప్రదేశ్ నుంచి కొంతమంది యువకులు వలస వచ్చి దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనాన్ని సాగిస్తున్నారు. సొంత గ్రామంలో పనుల్లేక, కాలాన్ని నమ్ముకుని దూరాన్ని లెక్క చేయకుండా అకుంఠిత ధైర్యంతో ఊరు కాని ఊరు వచ్చి చిరు వ్యాపారాలు చేస్తూ వారు జీవనం సాగిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జీన్ జిల్లా మిలేనియాకు చెందిన యువకులు వందలాది మైళ్ల దాటి భీమడోలు జంక్షన్‌లో టెంట్లు వేసుకుని రగ్గులు, దుప్పట్లు, స్వెట్టర్లు వంటి శీతాకాలంలో వినియోగించే దుస్తులను విక్రయిస్తున్నారు. సీజన్ ముగిసిన తర్వాత వారి సొంత ఊర్లకు వెళ్లిపోతామని వారన్నారు. స్వగ్రామాల్లో సరైన ఉపాధి పనుల్లేక, బతుకు దెరువు కోసం ఇక్కడకు వచ్చి వ్యాపారులు చేస్తున్నామని, మా వద్ద ఉన్న కొద్దిపాటు సొమ్ముతో సరుకు కొనుగోలు చేసి వచ్చామని, డిమాండ్‌ను బట్టి అదనపు స్టాక్ తెస్తామని వారన్నారు. రెయిన్ కోట్లు, మంకీ క్యాప్ లు, స్వెట్టర్లు, దుప్పట్లు విక్రయిస్తున్నామని వార న్నా రు.



భీమడోలులో ఏర్పాటు చేసిన శీతాకాలపు దుస్తుల దుకాణం

స్వెట్టర్లు రూ.400 నుంచి రూ.600, మంకీ క్యాప్‌లు రూ.100 నుంచి రూ.150, దుప్పట్లు రూ.350 నుంచి రూ.1,300 వరకు పలుకుతుందని వారు తెలిపారు. కొన్నేళ్లుగా ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా కొనుగోళ్లు పెరగడంతో రోడ్డు పక్కన ఏర్పాటు చేసే తాత్కాలిక దుకాణాల్లో వ్యాపారాలు తగ్గిపోయాయని, గిరాకీ ఉన్న సరుకును మాత్రమే తెచ్చి విక్రయిస్తున్నామని వారు తెలిపారు.

చలి ఎక్కువగా ఉంటేనే వ్యాపారం



ఎక్కువగా చలి ఉంటేనే మా వ్యాపారం ఆశాజనకంగా సాగుతుంది. ప్రస్తుతం చలి తక్కువగానే ఉండటంతో కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మూడేళ్లుగా ఈ ప్రాంతంలో చిరు వ్యాపారం చేసుకుని జీవన సాగించేందుకు వేలాది కిలోమీటర్ల దూరంగా ప్రయాణించి శీతాకాలంలో చలిని తట్టుకునే ఉన్ని దుస్తులు అమ్మేందుకు వస్తున్నాను. అరకొర సొమ్ముతో వ్యాపారం సాగించి పెట్టుబడి పోగా మిగిలిన ఆదాయంతో సరిపెట్టుకుంటున్నాం. మిగిలిన నెలల్లో స్వగ్రామాల్లో పనులు చేసుకుని జీవిస్తాం.

– ప్రకాష్, మధ్యప్రదేశ్, చిరు వ్యాపారి

ఒంటరిగానే ఉంటున్నాం



మా బంధువు ప్రకాష్‌తో కలిసి ఈ ప్రాంతానికి మొదటిసారిగా వచ్చాను. ఇద్దరం కలిసి నవంబర్‌లో వచ్చి టెంట్‌లో నివాసముంటున్నాం. అద్దెలు భరించే ఆదాయం రాదు. కుటుంబాలతో వస్తే ఇంకా ఇబ్బందులు పడతాం. మావాళ్లంతా ఊర్లలో ఉంటున్నారు. వారితో రోజూ ఫోన్లతో మాట్లాతాం. ఈ ఏడాది చలి తీవ్రత తక్కువగా ఉంది. దీంతో వ్యాపారాలు ఆశాజనకంగా లేవు. రాబోయే రోజుల్లో వ్యాపారం జోరుగా సాగుతుందని ఆశిస్తున్నాం.

– గోడ్ రాహుల్, మధ్యప్రదేశ్, వ్యాపారి

బాదంపూడి పాఠశాలకు కంప్యూటర్ల అందజేత



బాదంపూడి పాఠశాలలో స్టేట్ బ్యాంకు అధికారులతో ఉపాధ్యాయులు

ఉంగుటూరు: బాదంపూడి– 1 పాఠశాల అభివృద్ధికి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు సహాయం అందించడం అభినందనీయమని ఉపాధ్యాయులు అన్నారు. రూ. 3 లక్షలు విలువగల ఐదు కంప్యూటర్లు, నాలుగు ఇనుప బీరువాలు, నాలుగు ఎస్ టైపు కుర్చీలు, నాలుగు టేబుళ్లు, ఆట వస్తువులను పాఠశాలకు సోమవారం వారు అందజేశారు. ఈ సామగ్రిని హెచ్‌ఎం తోట మూర్తిరాజు, సలాది గణేష్‌కు ఎస్‌బీఐ ఏజీఎం రమేష్‌నాయుడు, మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటనాగేశ్వరరావు, రామచంద్రరావు అందజేశారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్ద కంకటాల వెంకట్వారు, ఎస్‌బీఐ మేనేజర్లు కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి కంకట పద్మలీలా, ఉప సర్పంచి దాసరి అప్పన్న, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సన్మానాలు బాధ్యతను మరింత పెంచుతాయి

గణపవరం: వివిధ రంగాల్లో లబ్ధప్రతిష్ఠులైన ప్రముఖులను సన్మానించడం మంచి పరిణామమని, సన్మానాలు వారి బాధ్యతలను మరింత పెంచుతాయని పలువురు అన్నారు. గణపవరంలోని రుద్రరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 27వ గోదావరి మాతా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ఎందరో ప్రతిభావంతులు వివిధ రంగాల్లో విశేష ప్రతిభాపాటవాలను చూపుతున్నారని, వారికి మాత్రం సమాజంలో తగిన గుర్తింపు రావడంలేదన్నారు. అలాంటి వారిని గుర్తించి రుద్రరాజు ఫౌండేషన్ వారు 27 ఏళ్లుగా ఎందరో ప్రముఖులను గోదావరిమాత అవార్డులతో సత్కరించడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్‌వీఎస్ రాజుమాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా నిరాటంకంగా గోదావరి మాత అవార్డుల ప్రదాన కార్యక్రమం విజయవంతంగా కొనసాగడానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



గణపవరంలో ప్రముఖులను గోదావరి మాత అవార్డులతో సత్కరిస్తున్న దృశ్యం

ఈఏడాది గోదావరి మాత అవార్డులకు నలుగురు ప్రముఖులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వైద్యరంగంలో కాకినాడకు చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు చప్పిడి వెంకటేశ్వరరావు, చిత్రలేఖన రంగంలో తణుకుకు చెందిన సింకిన వెంకట్రామ శాస్త్రి, సాహితీ రంగంలో రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త బీహెచ్ రమాదేవి, సాహస రంగంలో భీమవరానికి చెందిన పర్వతారోహకుడు తోటకూర శ్రీనివాసవర్మను గోదావరి మాత అవార్డులకు ఎంపిక చేశారు. గణపవరం వర్తక సంఘ భవనంలో వారిని ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ఉపాధ్యక్షుడు వంకాయల రామరావు, తదితరులు పాల్గొన్నారు.

నాగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



కైకరం నాగమ్మతల్లికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుబాబు



కైకరం నాగమ్మతల్లిని దర్శించుకుంటున్న ఆర్డీవో అంబరీష్

ఉంగుటూరు: కైకరం సుబ్రహ్మమణ్య షష్ఠి మహోత్సవం వైభవంగా కొనసాగుతోంది. సోమవారం ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కైకరం గ్రామ నాయకులు వాసుబాబుకు స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో గౌరవించారు. నాగమ్మతల్లి పటాన్ని ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సొసైటీ మాజీ అధ్యక్షుడు శానం బాబ్జి, పుప్పాల గోపి, అద్దేపల్లి శేషయ్య, కొరిపల్లి శ్రీను, నాని, నక్క శ్రీను పాల్గొన్నారు. ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ కైకరం షష్ఠిని సందర్శించారు. నాగమ్మతల్లిని దర్శించుకున్నారు.తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు, రెవెన్యూ అధికార్లు ఆయనకు స్వాగతం పలికారు.

మూడు ఘటనల్లో ఏడుగురిపై కేసుల నమోదు

భీమడోలు: వివిధ గ్రామాల్లో మూడు ఘటనల్లో ఏడుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసామని సోమవారం పోలీసులు తెలిపారు. ఎస్సై వై.సుధాకర్ మాట్లాడుతూ పేకాట శిబిరంపై, కోళ్ల వ్యర్థాలను అక్రమంగా రవాణా చేస్తుండగా రెండు చోట్ల ఆకస్మికంగా దాడి చేసినట్టు తెలిపారు. పూళ్ల శివారు ఎంఎంపురంలోని శ్మశాన వాటిక భూముల్లో పేకాట శిబిరంపై దాడి చేసి రూ.1,520 నగదును స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. హైదరాబాద్ నుంచి ఉండికి ఓ వ్యాన్‌లో 10 టన్నుల కోళ్ల వ్యర్థాలను అక్రమంగా రవాణా చేస్తుండగా కుర్రెళ్లగూడెం వద్ద తనిఖీలు చేసి వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ మహ్మద్ గౌస్, యాజమాని మహ్మద్ అబ్బాస్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. భీమడోలు రైల్వే గేటు వద్ద ఏలూరు నుంచి తోకలపల్లి ఆక్వా చెరువుకు ఒక టన్ను కోళ్ల వ్యర్థాలను వ్యాన్‌లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వ్యాన్‌తో పాటు కోళ్ల వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. తోకలపల్లికి చెందిన వ్యాన్ డ్రైవర్, యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

సమ్మెటివ్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయండి

భీమడోలు: సమ్మెటివ్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాల్సి బాధ్యత ఉపాధ్యాయులదేనని భీమడోలు ఎంఈవో ఈడుపల్లి శ్రీనివాసరావు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ నెల 11 నుంచి సమ్మెటివ్ పరీక్షలు నిర్వహించనున్నందున విద్యార్థులు చక్కగా పరీక్షలు రాసేలా టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని గ్రామస్తులు, పేరెంట్స్ కమిటీ సహకారంతో విజయవంతం చేసిన ఉపాధ్యాయ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.నిర్మల కుమారి, టీచర్ మండే సుధాకర్ పాల్గొన్నారు.

న్యాయవాద సదస్సులు సమాజ సేవకు దోహదం

పెదవేగి: న్యాయవాద సదస్సులు సమాజ సేవకు దోహదం చేస్తాయని స్టేట్ కోఆర్డినేటర్ విజయవాడ కథోలిక్ పీఠం ఫాదర్ బొందల స్లీవరాజు అన్నారు. సోమవారం ఆయన డెంటల్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి హాజరైన కథోలిక న్యాయవాదులు, గురువులు, సిస్టర్లు, సుపీరియర్లను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. మూడు రోజులు పాటు జాతీయ న్యాయవాద సదస్సు నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలు అందించిన ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు, నిర్వహణ బృందాన్ని ఫాదర్ స్లీవ రాజు అభినందించారు. దేశవ్యాప్తంగా మరిన్ని న్యాయవాద సదస్సులు నిర్వహించేందుకు తమ బృందం తోడ్పాటునందిస్తుందన్నారు. అనంతరం నిర్వహణ బృంద న్యాయవాదులు సిస్టర్లను ఆయన అభినందించి జ్ఞాపిక అందజేశారు.



సదస్సులో పాల్గొన్న సిస్టర్లు, ఫాదర్లు

మీకోసంలో ఐదు అర్జీలు

భీమడోలు: భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ అంశాలపై ఐదు అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. అర్జీదారుల నుంచి భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి అర్జీలు స్వీకరించి సంబంధిత శాఖలకు అందించారు. గుండుగొలనులోని పెద్ద చెరువు సమస్య, కాలనీ సమస్యలు, గృహనిర్మాణ శాఖలకు చెందిన అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోపి మూర్తి విజయంపై ఉపాధ్యాయుల హర్షం

ఉంగుటూరు: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బొర్రా గోపిమూర్తి ఘన విజయం సాధించడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. యూటీఎఫ్ ఉంగుటూరు మండలం నాయకులు సోమవారం కాకినాడలోని ఓట్ల లెక్కింపు కౌంటింగు కేంద్రం వద్దకు వెళ్లి గోపిమూర్తికి అభినందనలు తెలిపి విజయోత్సవంలో పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీధర్, ఉంగుటూరు మండల గౌరవ అధ్యక్షుడు శీతాల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి జోగి నాయుడు, కోశాధికారి ఆనంద్ పాల్గొన్నారు.

అదాని అక్రమాలపై విచారణకు డిమాండ్

ఏలూరు (టూటౌన్): సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సోమవారం ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద డిమాండ్స్ డే సందర్భంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పారిశ్రామికవేత్త గౌతమ్ అదాని అక్రమాలపై పార్లమెంటరీ విచారణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. అల్లర్లతో అట్టుడుకుతోన్న మణిపూర్ రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటించాలన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశంలో ధరలను అదుపు చేయడంలో, నిరుద్యోగ సమస్య పరిష్కారంలో విఫలమయ్యారని ఆరోపించారు.



పాత బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

మోదీ తన హామీల అమలుకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉప్పులూరి హేమ శంకర్, కుర్రెళ్ల వరప్రసాద్, పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి పాల్గొన్నారు.

విద్యుత్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ ఈపీ డిస్కమ్ నూతన కార్యవర్గ ఎన్నిక ఈ నెల 8న విశాఖపట్నంలో జరిగిందని ఎన్నికల అధికారి, అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ పి.సన్యాసిరావు ఏలూరులో సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా కె.సత్యప్రసాద్, జి.జోగి నాయుడు, ఉపాధ్యక్షుడిగా ఎం శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా జీఎస్ఎస్ పట్నాయక్, జాయింట్ సెక్రటరీలుగా ఎస్ఎం అహ్మద్, జి.వీర్రాజు, టి.రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎ.శ్రీను, బి.రఘు, ఆఫీస్ సెక్రటరీగా సీహెచ్‌ఆర్‌బీ శాస్త్రి, ఫైనాన్స్ సెక్రటరీగా పి.త్రినాథ్, బిల్డింగ్ సెక్రటరీగా ఎంవీ గురుప్రసాద్, మహిళా ప్రతినిధిగా పి.మాధవి లావణ్య ఎన్నికయ్యారని తెలిపారు.

దోమలతో ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తి

పెదపాడు: ప్రపంచ జనాభా కంటే దోమల సంఖ్యే ఎక్కువని, ఎక్కువ వ్యాధులు దోమలు కుట్టడం వల్ల సంక్రమిస్తున్నాయని ప్రభుత్వ వైద్యాధికారి భారతి, అసిస్టెంట్ మలేరియా అధికారి జే గోవిందరావు తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు భారతి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు దోమల వల్ల కలిగే వ్యాధులపై డాక్టరు భారతి అవగాహన కల్పించారు. ప్రపంచంలో 3,600 రకాల దోమలున్నాయని వాటిలో 3 రకాల దోమలు చాలా ప్రమాదకరమని చెప్పారు. వీటిలో ఆడ ఎడిస్ దోమ కుట్టడం వల్ల డెంగీ, చికెన్ గున్యా జ్వరాలు వస్తాయని ఆడ అనాఫిలస్ కట్టడం వల్ల మలేరియా వస్తుందని, ఆడ క్యూలెక్స్ దోమ వల్ల బోదకాలు, మెదడువాపు వస్తాయని తెలిపారు. ఎడిస్ దోమ, ఆడ ఎనాలిఫిస్ దోమ మంచినీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయని, క్యూలెక్స్ దోమలు మురుగు నీరు నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయని తెలిపారు. వారానికి ఒకసారి మంచినీరు నిల్వ ఉండే ప్రాంతాలైన తొట్టిలు, డ్రమ్ములు, ఓవర్‌హెడ్ ట్యాంకులు వారానికి ఒకసారి కడిగి మూతలు పెట్టుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని తెలిపారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సరళ, రవికుమార్, మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య ఆశా కార్యకర్తలు నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

సమస్యలపై గళం విప్పిన ప్రజలు



సమస్యలపై అర్జీ అందజేస్తున్న చేబ్రోలు వాసులు



కొత్తగూడెంలో శ్మశాన వాటిక ఆక్రమణపై అర్జీ అందజేస్తున్న యువకులు

ఉంగుటూరు: సమస్యలపై గ్రామాల్లోని ప్రజలు గళం విప్పారు. ఐదు నెలలు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం కాని అంశాలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికపై గళం విప్పి అధికారులకు ప్రజలు మొరపెట్టుకున్నారు. సోమవారం ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదిక సాక్షిగా పలు గ్రామాల ప్రజలు, బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు అధికారులకు ఫిర్యాదులు అందజేసి ఆందోళన వ్యక్తం చేశారు. తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు, ఎంపీడీవో గంజిరాజ్ మనోజు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీలిచ్చారు. గ్రామంలో 8 మంది అనర్హులకు పెన్షన్లు అందజేస్తున్నారని వాటిని పరిశీలించి రద్దు చేయాలని రావులపర్రుకి చెందిన తాడిశెట్టి శివప్రసాదు తహసీల్దార్‌కు అర్జీ అందజేశారు. గ్రామంలో శ్మశాన వాటిక ఆక్రమణకు గురైందని తిమ్మయ్యపాలెం పంచాయతీ కొత్తగూడెంనకు చెందిన మానికల నాగార్జున, ఏముూరి శ్రీనివాసరావు అర్జీ అందజేశారు. శ్మశాన వాటిక ఆక్రమణకు గురైన కారణంగా అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని అర్జీలో పేర్కొన్నారు. ఎ.గోకవరంలో 4 ఎకరాల భూమిని తన భర్త కుమారుడికి రాశారని, ఇంకా అక్కడ మిగిలి ఉన్న 70 సెంట్ల భూమిని తన జీవనానికి ఉపయోగపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నలజర్ల మండలానికి చెందిన కామన కనక లక్ష్మి అర్జీ అందజేసింది. ఇప్పుడు నివసిస్తున్న ఇంటిని పెద్దకొడుకు రామకృష్ణ స్వాధీనం చేసుకుని, ఇంటి నుంచి బయటకు పంపించాడని అతనిపై చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని చేబ్రోలుకు చెందిన గాలి దేవర రంగమ్మ, ఆమె చిన్నకొడుకు కలిసి తహసీల్దారుకు ఫిర్యాదు అందించారు. జీవో 67 ప్రకారం ప్రభుత్వ కామన్ స్థలాల్లో ఎటువంటి ఆక్రమణలకు అనుమతి ఇవ్వడానికి వీలులేనందున తమ గ్రామంలోని ఎస్టీఆర్ కాలనీలో ఇంటూరి ధనలక్ష్మి ఇంటి సమీపంలో వేసిన షెడ్లును తొలగించాలని నారాయణపురానికి చెందిన న్యాయ వాది తల్లిబోయిన రాజేష్ ఎంపీడీవో మనోజ్‌కు ఫిర్యాదు అందజేశారు. ఇలా పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అధికారులకు అందజేశారు. ఉపాధి ఏపీవో మల్లేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు, వెటర్నరీ మండల అధికారి డాక్టర్ శిరీష, లైవ్ స్టాకు అధికారి బాబూరావు, చేబ్రోలు, కాగుపాడు పీహెచ్‌సీల బాధ్యులు వెంకటస్వామి, గణపతి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శారదామణి తదితరులు పాల్గొన్నారు. ప్రజావేదికకు హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు ఎంపీడీవో రాజ్‌మనోజ్ తెలిపారు.